క్లుప్తంగా

రైల్వే క్రాసింగ్ మూసివేత

చిట్యాల: పట్టణంలోని చిట్యాల–ఉరుమడ్ల గ్రామాల మధ్య ఉన్న రైల్వే క్రాసింగ్ (రైల్వే క్రాసింగ్ గేట్ 26)ను శనివారం, ఆదివారం మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే క్రాసింగ్ వద్ద మరమ్మతులు చేపడుతున్నందున రెండు రోజులపాటు రైల్వే క్రాసింగ్ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆ పాఠశాలకు అనుమతులు లేవు: ఎంఈఓ

చండూరు: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేవని ఎంఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు వెళ్లి అన్ని రికార్డులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్పించవద్దని పేర్కొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్


అనితకుమారిని అభినందిస్తున్న వీసీ

నల్లగొండ టూటౌన్ : మిత్ర కవిత్వం–సమగ్ర పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ చింతకింది కాశీం పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంజీయూ తెలుగు అధ్యాపకురాలు సి.అనితకుమారి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ కె.అరుణప్రియ, కె.ప్రేమ్‌సాగర్, డాక్టర్ పి.మద్దిలేటి, ప్రశాంతి, తెలుగు శాఖ అధ్యాపకులు డా.ఎం.ఆనంద్, డా.ఎం.సత్యనారాయణరెడ్డి, జి.నరసింహం పాల్గొన్నారు.

తిప్పర్తి ఎస్‌ఐగా శంకర్



తిప్పర్తి : తిప్పర్తి మండల నూతన ఎస్‌ఐగా శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎస్‌ఐ సాయి ప్రశాంత్ ఇటీవల బదిలీపై హాలియా వెళ్లారు. ఆయన స్థానంలో శంకర్ ఇక్కడికి వచ్చారు.

బంగారు నంది అవార్డు అందుకున్న సదాలక్ష్మి


అవార్డు అందుకుంటున్న సదాలక్ష్మి

నల్లగొండ: పట్టణానికి చెందిన చింతపల్లి సదాలక్ష్మి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో హైదరాబాదులో శుక్రవారం బంగారు నంది అవార్డు అందజేశారు. అలియాడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో డాక్టర్ అవార్డ్స్ గ్లోబల్ ఐకాన్ ఎక్సలెంట్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి చేతుల మీదుగా ఆమె బంగారు నంది అవార్డు అందుకున్నారు.

బ్యాగుల పంపిణీ


బ్యాగులు పంపిణీ చేస్తున్న సైదులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఏపీ లింగోటం గ్రామానికి చెందిన మేకల సైదులు–రాధిక కుమారుడు చరణ్ జ్ఞాపకార్థం గ్రామంలోని హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేపల్లి కాశయ్య, మణిరాజు, సత్యనారాయణ, వినోద, ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం(ఒకటో వార్డు)లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు భారతీయ విద్యా భవన్ అకాడమిక్ డైరెక్టర్ బండ రమాదేవి నోట్ పుస్తకాలను సమకూర్చారు. శుక్రవారం ఆ పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు బండ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు నోట్ పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయులు నర్రా లవేందర్‌రెడ్డి, గంగుల కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

22న పెన్షనర్ల భవనం ప్రారంభం

చిట్యాల: హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి సమీపంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ ఆర్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ భవనాన్ని ఈ నెల 22వ తేదీన ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. అసోసియేషన్ జాతీయ చైర్మన్ ఎం.ఎన్.రెడ్డి, జాతీయ కార్యదర్శి శ్రీకుమార్ భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


నల్లగొండ పట్టణంలో యోగా సాధన చేస్తున్న మహిళలు


యోగాసనాలు వేస్తున్న మహిళలు, యువతులు

- క్రమం తప్పకుండా యోగా చేస్తే రుగ్మతలు దూరం
- ఆసనాలతో తగ్గుతున్న బీపీ, షుగర్
- పెరుగుతున్న రోగనిరోధక శక్తి
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నల్లగొండ టూటౌన్ : దైనందిన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిళ్లకు గురయ్యే ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకపోవడంతో వివిధ వ్యాధులబారిన పడుతున్నారు. కుటుంబ పోషణ కోసం ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఆరోగ్యం బాగా లేకున్నా పట్టించుకోకుండా తమ పనిలో నిమగ్నమవుతున్నారు. ఇలాంటి మానసిక ఒత్తిడి, ఆందోళన కారణంగా బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబకాయం, అస్తమా, పార్శ్వనొప్పి, నరాల బలహీనత లాంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వ్యాధి వచ్చిన తరువాత ఆస్పత్రుల చుట్టూ తిరిగినా, వేల రూపాయల డబ్బు ఖర్చు అవుతుందే తప్ప వచ్చిన రుగ్మతలు మాత్రం పూర్తిగా పోవడంలేదు. ఇలాంటి వాటిని జయించాలంటే నిత్యం యోగా సాధన చేయడం ద్వారా అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని యోగా సాధకులు చెబుతున్నారు.

శారీరక శ్రమ లేని వారికి ఎంతో ఉపయోగకరం

క్రమం తప్పకుండా ప్రతిరోజూ అరగంట నుంచి గంటసేపు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుంది. అదేవిధంగా శారీరక శ్రమ లేని వారికి ఈ యోగాసనాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. యోగా చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి అనారోగ్య సమస్యలను అధిగమించడానికి ఆస్కారం ఏర్పడుతుందని యోగా సాధకులు చెబుతున్నారు. యోగాసనాలు చేయడంతో వ్యక్తిలోని అన్ని శరీర భాగాలు అన్ని వైపులా కదులుతూ ఎలాంటి కఠిన సమస్య వచ్చినా ఎదుర్కోవడానికి సన్నద్ధం కావొచ్చు.

క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాం



ఐదు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తున్నా. వివిధ రకాల ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. యోగా వల్ల నాకు మానసిక ప్రశాంతత కలగడంతోపాటు ఏడు కిలోల బరువు తగ్గాను. నీరసం దరిచేరడం లేదు.

– కట్ట జ్యోతి, యోగా సాధకురాలు, నల్లగొండ

థైరాయిడ్ సమస్య తీరింది



ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో నాకు థైరాయిడ్ సమస్య తీరింది, అధిక బరువు తగ్గింది. సూర్య నమస్కారాలు చేయడం ద్వారా బీపీ, షుగర్ నార్మల్‌గా ఉంటోంది. ధ్యానం చేస్తుండడంతో ఒత్తిడి తగ్గి ప్రశాంతమైన నిద్ర వస్తోంది. మనకు ఎంత పని ఉన్నా ప్రతిరోజు యోగాసనాలు తప్పకుండా చేయాలి. రుగ్మతలు వచ్చినా తట్టుకుని నిలబడే శక్తి వస్తుంది.

– సురభి గంగాభవాని, యోగా సాధకురాలు నల్లగొండ

ఉచితంగా యోగాసనాలు నేర్పిస్తున్నా



ప్రజలకు 15 సంవత్సరాలుగా ఉచితంగా యోగా సనాలు నేర్పిస్తున్నా. యోగా చేయడం ద్వారా శారీరకంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండవచ్చు. జీర్ణక్రియ పెరిగి రోగాన్ని తట్టుకునే శక్తి పెరుగుతుంది. నిగ్రహంగా, ఓపికగా ఉండి బరువు తగ్గవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా రష్యా, ఇండోనేషియాలో ఉంటున్న తెలుగు వాళ్లు యోగా నేర్చుకుంటున్నారు.

– ఊట్కూరి నాగేశ్వర్‌రావు, యోగా గురూజీ, నల్లగొండ

బాలికల సాధికారతపై అవగాహన


నకిరేకల్ : ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర బాలికల సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ అస్త అంజుమ్ పాల్గొని మాట్లాడుతూ బాల్య, మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దన్నారు. బాలికలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, భవాని, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, పాఠశాల సిబ్బంది అనిత, శ్రీదేవి, అశ్రీత, ఝాన్సీ, మంగమ్మ, రేణుక అంగన్‌వాడీ టీచర్లు సుజాత, ధనమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు బాలికా సాధికారతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ పాల్గొని బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పౌష్టికాహారం, అక్రమ రవాణా, పోక్సో చట్టం, హెల్ప్ లైన్ నంబర్లు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యశోద, శ్రీలత, ఉపాధ్యాయులు సవిత, ఐసీపీఎస్ రాము, ఏఎన్‌ఎం అరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నాంపల్లి: మండలంలోని దేవత్‌పల్లి, దామెర, నేరళ్లపల్లి గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళికృష్ణ వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాలకు బస్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు, శ్రీధర్, నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించాలి

నల్లగొండ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డైట్ పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులు ఉండగా అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఫ్యాకల్టీస్, బోధనేతర సిబ్బంది లేరన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కోట్ల అశోక్‌రెడ్డి, గుండాల నరేష్, అవుట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

24న వర్క్‌షాప్

చిట్యాల: నకిరేకల్‌లో ఈ నెల 24వ తేదీన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి తెలిపారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన ఆ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించడంతోపాటు కూలీలకు రెండు రోజుల పని దినాలను కల్పించాలని, రోజుకు ఆరు వందల రూపాయల వేతనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కల్లూరి కుమారస్వామి, గుడిసె లక్ష్మీనారాయణ, నకిరేకంటి రాములు, కోనేటి రాములు, రెడపాక మల్లయ్య, యాదయ్య, నర్సింహ, ఇస్తారి, శంకరయ్య పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత


కేతేపల్లి : అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కేతేపల్లి: నిత్యం యోగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ఆయుర్వేద వైద్యాధికారిణి నేహ అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేతేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గర్భిణులకు యోగాపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అద్భుతమైన సాధనమే యోగా అన్నారు. వైద్యాధికారి అర్చన, మాజీ కో ఆప్షన్ సభ్యుడు చందా రామ్మూర్తి, వైద్య సిబ్బంది డీవీఎల్ రెడ్డి, రుక్మారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో..

చిట్యాల: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కో ఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు అన్నారు. చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం యోగాపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో యోగాసానాలు వేయించారు. కార్యక్రమంలో పీఈటీ జానకి, ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, మేడబోయిన శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్లగొండ టౌన్: పట్టణంలోని అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు శుక్రవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేయాలని, అసంపూర్తిగా ఉన్న రోడ్లు పూర్తి చేయాలని కోరారు. ఆసరా పింఛన్‌దారులకు పింఛన్ల పంపిణీ సమయంలో పోస్టాఫీస్‌ల వద్ద తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాలని కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

చిట్యాల: గ్రామాల్లో ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలను కేటాయించే జీఓ 07న పకడ్బందీగా అమలు చేసి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామసభల ద్వారా అధికారులు ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేసి బహిరంగంగా ప్రకటించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీలో అధికారులు, ప్రజాప్రతినిధులు అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవిశెట్టి శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అర్రూరి శ్రీను, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ, కల్లూరి కుమారస్వామి, నెల్లికంటి నర్సింహ, ఐతరాజు యాదయ్య, జిట్ట స్వామి, పంది నరేష్, మెట్టు నర్సింహ, గుడిసె లక్ష్మీనారాయణ, కందగట్ల గణేశ్, కోనేటి రాములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

గట్టుప్పల్ : వెల్మకన్నె గ్రామంలో శుక్రవారం అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కృష్ణ, దెండె బీరప్ప, చాపల మారయ్య, తలకోల గోపాల్‌రెడ్డి, రావుల పర్వతాలు, నూర్ మహమ్మద్, బాలం మహేష్, కంపె దుర్గయ్య, భీమనపల్లి యాదయ్య, వనం వెంకటయ్య, భీమనపల్లి మల్లయ్య, రాములు, రమేష్, సైదులు, హుస్సేన్ పాల్గొన్నారు.

చండూరు: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కోడి శ్రీనివాసులు, దోటి వెంకటేశ్, కల్లెట్ల మారయ్య, రామ్మూర్తి, మల్లేష్, సంజయ్, జనార్దన్, వేణు, బ్రహ్మం, నాంపల్లి శోభ, శేఖర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

మర్రిగూడ : ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్మీడియట్‌కు ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు మర్రిగూడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కళా శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. అపరాధ రుసుము లేకుండా జూలై 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, అపరాధ రుసుముతో ఆగస్టు 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బడి మానేసి ఇతర పనులు చేసుకుంటున్న 14 సంవత్సరాలు దాటిన వారు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు పాఠశాలలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కృష్ణయ్యను సంప్రదించాలన్నారు.

పాఠశాలల తనిఖీ


కూరగాయలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

చండూరు: బోడంగిపర్తిలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం చండూరు మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు తనిఖీ చేశారు. తరగతి గదులు, మధ్యాహ్న బోజనాలు, కిచెన్, టాయిలెట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వర్‌రావు మాట్లాడుతూ శానిటేషన్ మెరుగుపరచాలని, మెనూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు

చండూరు: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు టీబీ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బంగారిగడ్డ గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు చేయగా 13 మందిని ఇతర పరీక్షల కోసం జిల్లా ఆస్పత్రికి పంపారు. కార్యక్రమంలో పల్లె ఆస్పత్రి డాక్టర్ సత్యనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశం, ఏఎన్‌ఎంలు కిరణ్‌కుమారి, మాధవి, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయండి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


విద్యార్థినికి చాక్లెట్ అందజేస్తున్న కలెక్టర్

చండూరు : భవిత కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. చండూరులో భవిత కేంద్రం పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. పనులు పూర్తి కాకపోవడంతో సంబంధిత ఏఈపై మండిపడ్డారు. త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సుధాకర్‌రెడ్డికి సూచించారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత తరగతులను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఒక్కొక్కరి పేర్లను అడిగి బ్లాక్ బోర్డుపై రాయమని చెప్పి వారికి చాక్లెట్లు అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో సమస్యలపై కలెక్టర్ దృష్టికి అధ్యాపకులు తీసుకురాగా.. విచారించి రెండు రోజుల్లోగా రిపోర్టు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. వైద్య సేవలకు వచ్చినవారితో మాట్లాడారు. అనంతరం డాక్టర్ బ్లెస్సీ సంధ్యతో మాట్లాడి పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. త్వరలోనే నూతన బిల్డింగ్ మంజూరు చేయిస్తామని, ఆస్పత్రికి ఏవైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తదుపరి చండూరులో ఉన్న దేవాదాయ శాఖ భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ యాదగిరి, ఎంఈఓ సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, ప్రధానోపాధ్యాయులు మమత, పిల్లి యాదగిరి, ఏఈ, డీఈ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు


నకిరేకల్: మండలాపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


నార్కట్‌పల్లి : ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను దశల వారీగా ఇస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం మండలాపురం గ్రామంలో శుక్రవారం 45 ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజురయ్యాయని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 31 వేల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వీరిలో అర్హులకు మూడు దశల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల హౌసింగ్ ఏఈ మధుశాలిని, పంచాయతీ కార్యదర్శి నాగమణి, మాజీ సర్పంచ్ దండి నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని నకిరేకల్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతితో కలిసి శుక్రవారం విద్య శాఖపై ఆయా మండలాల ఎంఈఓలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

శాలిగౌరారం: గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంతోపాటూ గ్రామీణ వైద్యులపై ఐఎంఏ దాడులు ఆపాలని కోరుతూ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు మండలాల గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు వీపూరి పరాంకుశం, దునుక వెంకన్న, మాదు వెంకన్న, రాజుల సైదులు, సయ్యద్ అజ్మత్, రసం సత్తయ్య, సతీష్, నరేశ్, బెల్లం సత్తి, దొనకొండ అంజయ్య, దామెర్ల శ్రీనివాసులు, వీరస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

నార్కట్‌పల్లి : ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని జువ్విగూడెం గ్రామ పంచాయతీ ఆవాసం కిష్టాపురం (జంగాల కాలనీ)లో 29 ఇళ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడతలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చరిత, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, భారత్, సిద్దగోని స్వామి, నర్సిరెడ్డి, జాన్‌రెడ్డి, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామంలోని 30 మంది రైతుల వ్యవసాయ పంటలకు ఉపయోగపడే 3 ట్రాన్స్‌ఫార్మర్‌లను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, సిద్దగోని స్వామి, గడ్డం పశుపతి, నూకల శంకర్, రాంగోపాల్‌రెడ్డి, ఐలయ్య, తండు సైదులు, పంతంగి జానయ్య, లింగయ్య, గద్దటుటి యాదయ్య, కొత్తపేట స్వామి, వెంకన్న, రాందాస్, అంజయ్య, యాదన్న, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


జ్ఞాపిక అందజేస్తున్న తోటి ఉద్యోగులు

చిట్యాల: వెలిమినేడు గ్రామానికి చెందిన అంతటి అజయ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్న తోటి ఉద్యోగులు బాధిత కుటుంబానికి ఆర్థిక తోడ్పాడు అందించేందుకు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన రూ.64,500 నగదు, జ్ఞాపికను శుక్రవారం అజయ్‌కుమార్ తల్లిదండ్రులకు అందజేశారు. గోలి నరేష్, సైదులు, రాజేష్, అరుణ్, జయకృష్ణ, మల్లికార్జున్, సత్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.